క్లుప్తంగా

చంద్రగిరి ఎంపీడీఓగా బాలాజీ నాయక్


బాధ్యతలు స్వీకరిస్తున్న బాలాజీ నాయక్

చంద్రగిరి: నూతన ఎంపీడీఓగా బాలాజీ నాయక్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న రమేష్‌బాబు తిరుపతి రూరల్ ఎంపీడీఓగా బదిలీ కావడంతో శ్రీకాళహస్తిలో ఉన్న బాలాజీ నాయక్ ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఏఓ రవిచంద్ర, చంద్రగిరి పంచాయతీ కార్యదర్శి మహేశ్వరయ్య, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

సమగ్రాభివృద్ధే ధ్యేయం



తిరుపతి రూరల్: మండలంలోని అన్ని గ్రామాల సమగ్రాభివృద్ధే ధ్యేయమని తిరుపతి రూరల్ ఎంపీడీఓ రమేష్‌బాబు పేర్కొన్నారు. తిరుపతి రూరల్ నూతన ఎంపీడీఓగా గురువారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ విప్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సహకారంతో తుడా చైర్మన్, రూరల్ ఎంపీపీ మోహిత్‌రెడ్డి ఆధ్వర్యంలో మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పూర్తి స్థాయిలో విజయవంతం చేయడమే లక్ష్యమన్నారు. తొలుత ఇన్‌చార్జ్ ఎంపీడీఓ పిచ్చిరెడ్డి నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన రమేష్ బాబును వైస్ ఎంపీపీలు వేముల యశోద, విడుదల మాధవరెడ్డి, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు అభినందించారు.

ఎంఆర్ రాజా మృతికి ఎమ్మెల్యే భూమన నివాళి



తిరుపతి మంగళం: బీజేపీ సీనియర్ నాయకుడు ఎంఆర్ రాజా మృతికి టీటీడీ చైర్మన్, తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. గురువారం ఎంఆర్ రాజా భౌతిక కాయానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకున్నారు. అనంతరం ఎంఆర్ రాజా కుటుంబ సభ్యులను పరామర్శించారు.

పురందేశ్వరి అనుచిత వ్యాఖ్యలు దుర్మార్గం

తిరుపతి కల్చరల్: తిరుపతి అభివృద్ధికి టీటీడీ నిధులు కేటాయించకుండా అడ్డుకుంటామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి అనుచిత వ్యాఖ్యలు చేయడం దుర్మార్గమని తిరుపతి స్థానిక హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు డీఎంసీ భాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. టీటీడీలో తిరుపతి ఒక భాగమని, తిరుపతి చరిత్ర తెలియక కేవలం రాజకీయ ఉనికిని చాటుకునేందుకే బీజేపీ నేతలు విమర్శలు చేస్తున్నారని పేర్కొన్నారు.


శెట్టిపల్లి రైతులకు ప్రొసీడింగ్స్ అందజేస్తున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి


ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డికి సత్కారం

దశాబ్దాల సమస్యకు శాశ్వత పరిష్కారం

- భూ సమస్య పరిష్కారంలో అభినయ్‌రెడ్డి కృషి అభినందనీయమంటున్న రైతులు
- శెట్టిపల్లి రైతులు, ప్లాట్లు కొనుగోలుదారుల్లో ఆనందోత్సాహం

తిరుపతి మంగళం: దశాబ్దాలుగా పరిష్కారం కాని శెట్టిపల్లి భూ సమస్యను పరిష్కరించిన దేవుళ్లు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి, తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటామని శెట్టిపల్లి రైతులు, ప్లాట్లు కొనుగోలుదారులు తెలిపారు. దశాబ్దాలుగా పరిష్కారం కాని శెట్టిపల్లి భూ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతూ గురువారం ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి, జేసీ డీకే బాలాజీ, డిప్యూటీ మేయర్ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి ప్రొసీడింగ్స్ పత్రాలను అందించడంపై రైతులు, ప్లాట్లు కొనుగోలుదారులు హర్షం వ్యక్తం చేశారు. కూలీనాలి చేసుకుని పైసా పైసా కూడిబెట్టి కొనుక్కున్న ప్లాట్లు ఏళ్ల తరబడిగా సొంతం కాక నానా అవస్థలు పడ్డామని లబ్ధిదారులు తెలిపారు. రిజిస్ట్రేషన్లు చేసుకున్నప్పటికీ అమ్ముకోలేక తీవ్ర ఇబ్బందులు పడ్డామన్నారు. భూమన కుటుంబం తమకు అండగా నిలబడి దశాబ్దాల శెట్టిపల్లి భూ సమస్యకు పరిష్కారం చూపి వేలమంది పేద కుటుంబాల్లో వెలుగులు నింపారని సంతోషాన్ని వ్యక్తం చేశారు.

అభినయ్‌రెడ్డి కృషి అభినందనీయం...

ఏళ్ల తరబడి పరిష్కారం నోచుకోని శెట్టిపల్లి భూ సమస్యను పరిష్కరించడంలో ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి కృషి అభినందనీయమని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కందారపు మురళి అన్నారు. శెట్టిపల్లి భూ సమస్యపై ఎంతోమంది నాయకులను కలిశామని, ఎన్నో ఉద్యమ పోరాటాలు చేశామని గుర్తు చేశారు. అయినప్పటికీ శెట్టిపల్లి భూ సమస్యను పరిష్కరించడం ఎవ్వరికీ సాధ్యం కాలేదన్నారు. అతి చిన్నవయసు కలిగిన భూమన అభినయ్‌రెడ్డి ఆలోచన విధానం, సమస్య పరిష్కారానికి అందరిని కలుపుకునే తత్వం అభినందనీయమన్నారు. పార్టీలకు అతీతంగా శెట్టిపల్లి భూ సమస్యను పరిష్కరించడంలో వారు చూపిన చొరవ వల్లే శాశ్వత పరిష్కారం లభించిందన్నారు. ప్రొసీడింగ్స్ ఇవ్వడమంటే వారి భూములకు పూర్తి హక్కు కల్పించనట్లేనన్నారు.

బతికుండగా పరిష్కారం కాదనుకున్నాం



ఏళ్ల తరబడి శెట్టిపల్లి భూముల సమస్య పరిష్కారం కాక నానా అవస్థలు పడ్డాం. పిల్లల చదువులు, పెళ్లిళ్ల కోసం భూములను విక్రయించుకోలేక అప్పులు చేసుకుని జీవిస్తూ వచ్చాం. శెట్టిపల్లి భూ సమస్య పరిష్కారం కోసం గత ప్రభుత్వాల చుట్టూ తిరిగి అలసిపోయాం. మేము బతికుండగా శెట్టిపల్లి భూ సమస్య పరిష్కారం కాదనుకున్నాం. అయితే గత ఎన్నికల్లో శెట్టిపల్లికి వచ్చిన భూమన కరుణాకరరెడ్డి, భూమన అభినయ్‌రెడ్డిలు అధికారంలోకి రాగానే శెట్టిపల్లి భూ సమస్య పరిష్కరిస్తామని మాట ఇచ్చారు. ఆ మాటకు కట్టుబడి ఎవ్వరికీ సాధ్యం కాని శెట్టిపల్లి భూ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిన భూమన కుటుంబానికి, సీఎం జగన్‌మోహన్ రెడ్డికి రుణపడి ఉంటాం. మాకు ఇంత మేలు చేసిన భూమన అభినయ్‌రెడ్డిని వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిపించుకుంటాం. – కాళహస్తి భాస్కరరావు, శెట్టిపల్లి తిరుపతి

కొండంత ధైర్యాన్ని నింపారు



ఎప్పటికీ పరిష్కారం కాదనుకున్న శెట్టిపల్లి భూ సమస్యకు ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డిలు శాశ్వత పరిష్కారం చూపి మాలో కొండంత ధైర్యాన్ని నింపారు. ప్లాట్లు కొనుగోలు చేసి ఏళ్ల తరబడిగా విక్రయించుకోలేక ఎన్నో ఇబ్బందులు పడ్డాం. మా సమస్యను పరిష్కరించేందుకు ఎవ్వరూ ముందుకు రాలేదు. మా కష్టాలు గుర్తించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి వచ్చే ఎన్నికల్లో అండగా ఉంటాం. మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుంటాం. – నాగమ్మ, ప్లాటు కొనుగోలుదారు

జగనన్నతోనే జనం జీవితాల్లో వెలుగులు

- ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డికి చిన్నగోర్పాడు ప్రజల అపూర్వ స్వాగతం

పాకాల: ప్రజల జీవితాల్లో వెలుగులు నిండాలన్నా... రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా.. ఒక్క జగనన్నతోనే సాధ్యమవుతుందని తుడా చైర్మన్, చంద్రగిరి వైఎస్ఆర్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని చిన్నగోర్పాడు పంచాయతీలో గడప గడపకు మహా పాదయాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. తమ గ్రామానికి వచ్చిన మోహిత్‌రెడ్డికి గజమాలలు వేసి, మంగళ హారతులు పట్టి, గుమ్మడి కాయలతో దిష్టి తీసి, బాణా సంచా పేల్చుతూ, మంగళ వాయిద్యాలతో పూలవర్షం కురిపిస్తూ ఘనంగా స్వాగతం పలికారు. ప్రజల గుండెల్లో సుస్థిర స్థానం సంపాదించిన చంద్రగిరి ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తనయుడు తమ ఇంటి ముందుకు వచ్చారని సంతోషం వ్యక్తం చేస్తూ నాయకులు సంబరంగా స్వాగతించారు. మోహిత్‌రెడ్డి పంచాయతీ పరిధిలోని బిల్లయ్యగారిపల్లి హరిజనవాడ, చిన్నగోర్పాడు, గుడార్లబండ, కొత్త వడ్డిపల్లి, కొత్తూరు, శ్రీరామాపురం, దిగువగొల్లపల్లి, దిగువగొల్లపల్లి హరిజనవాడ, గ్రామాల్లో సుడిగాలి పర్యటన చేశారు. గ్రామాల్లోని నాయకులు, యువతతో మమేకమై ప్రతీ గడపకు రెట్టించిన ఉత్సాహంతో ప్రతీ ఒక్కరిని పలకరిస్తూ పాదయాత్రను కొనసాగించారు. సమస్యలు ఏమైనా ఉన్నాయా.. అంటూ ప్రజలను అడిగి మరీ తెలుసుకున్నారు. స్వీకరించిన వినతుల పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకుని వెంటనే పరిష్కరించాలని సూచించారు.


మోహిత్‌రెడ్డితో ఆత్మీయంగా కరచాలనం చేస్తున్న గ్రామస్తులు


ఎడ్లబండిపై చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

సేవ కోసమే ఎమ్మెల్యే అభ్యర్థిగా...

ప్రతీ గడపలో సంక్షేమ పథకాలను వివరిస్తూ, ప్రభుత్వం ద్వారా పొందిన పథకాలు తెలిపే బుక్‌లెట్‌ని లబ్ధిదారులకు అందజేశారు. 'మీకు సేవ చేసేందుకు ఎమ్మెల్యే అభ్యర్థిగా 2024 ఎన్నికల బరిలో నిలుస్తున్నానని, ఆదరించి ఆశీర్వదించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. చంద్రగిరి నియోజకవర్గంలో అభివృద్ధికి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఎనలేని కృషి చేశారని, ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుని ప్రజలకు నిత్యం అందుబాటులో ఉన్నారని తెలిపారు. పంచాయతీ పరిధిలో రూ.1.94 కోట్లతో ప్రభుత్వ భవనాలు, సీసీ రోడ్లు తదితర అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు వివరించారు. పంచాయతీ ప్రజలకు రూ.3.17 కోట్లు నిధులు పంపిణీ చేసినట్లు వివరించారు. ప్రజా శ్రేయస్సుకు పరితపించే వారినే ఎన్నుకోవాలని, తనకు ఒక అవకాశం ఇచ్చి ఎమ్మెల్యేగా గెలిపించాలని ప్రార్థించారు. ఏఎంసీ చైర్మన్ లింగయ్య, డివిజన్ అధ్యక్షుడు హరిప్రసాద్‌రెడ్డి, కపిలేశ్వర్‌రెడ్డి, భాస్కర్‌నాయుడు, ఎంపీటీసీ మునిరత్నం నాయుడు, సురేష్, రఘుపతి, శివప్రసాద్, బాబురెడ్డి, పవన్‌కుమార్, రహీం, మోహన్, ఈశ్వరయ్య, మధుసూదన్‌రెడ్డి, రాజారెడ్డి పాల్గొన్నారు.

కేశవరెడ్డి మృతికి ఎమ్మెల్యే చెవిరెడ్డి సంతాపం



తిరుపతి రూరల్: పెరుమాళ్లపల్లికి చెందిన కుప్పిరెడ్డి గారి కేశవరెడ్డి మృతికి ప్రభుత్వ విప్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. పుత్తూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో కేశవరెడ్డి మృతి చెందాడు. గురువారం పెరుమాళ్లపల్లిలోని ఆయన భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆ కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి ఓదార్చారు. మంచి మనసు కలిగి అందరితో కలసి మెలసి సరదాగా జీవనం సాగించే కేశవరెడ్డి ఆకస్మిక మరణం తనను ఎంతో కలచి వేస్తోందని చెవిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.

గడప గడపలో ఘన స్వాగతం


చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

- చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డికి అపూర్వ స్వాగతం
- జాతరను తలపించిన రామాపురం

రామచంద్రాపురం: పచ్చని తోరణాలు, ప్రతి వీధిలోనూ అరటి చెట్లు, గడప గడపకు కార్యక్రమంలో పూలవర్షం, బాణాసంచా మోత, డప్పుల చప్పుడు, కోలాటాలు వెరసి జాతరను తలపించింది. గురువారం మండలంలోని సీరామాపురం పంచాయతీ దిగువ రామాపురం, దళితవాడ, కన్నెవారిఇండ్లులో చంద్రగిరి ఎమ్మెల్యే డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తనయుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి గడప గడపకు మీ హర్షిత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు ప్రతి ఇంటి గడపలోనూ మహిళలు మంగళ హారతులు పట్టి స్వాగతం పలికారు. పలుచోట్ల గ్రామస్తులు పూలవర్షం కురిపించి, పువ్వులపైనే నడిపించుకుంటూ తమ గ్రామాలకు తీసుకువెళ్లారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కులం, మతం, పార్టీ అనే తేడా లేకుండా అందరినీ ఒకేలా చూసి సంక్షేమం, అభివృద్ధి, సేవా కార్యక్రమాలు చేపట్టారని గుర్తు చేశారు. జగనన్న ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు ప్రతి ఇంటా సంతోషాన్ని నింపాయని, మరోసారి జగనన్నే ముఖ్యమంత్రి కావాలన్నారు. వచ్చే ఎన్నికల్లో చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని ఎమ్మెల్యేగా ఆదరించి గెలిపించాలని కోరారు. ఎంపీపీ ఏపీ బ్రహ్మానందరెడ్డి, జడ్పీటీసీ ఢిల్లీ రాణి, వైఎస్ఆర్ సీపీ మండల కన్వీనర్ చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచులు సుబ్రమణ్యంరెడ్డి, భారతి, గణపతి నాయుడు, నల్లందుల సుధాకర్‌రెడ్డి, ఉప సర్పంచి పుష్పకాంత్‌రెడ్డి, ఎంపీటీసీలు చంద్రశేఖర్‌రెడ్డి, రాజేష్, వైఎస్ఆర్ సీపీ నాయకులు భానుకుమార్‌రెడ్డి, వేణునాథరెడ్డి, గురుస్వామిరెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి, మురళి, బాబురెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి, అశోక్, సుధ, తిరుపాలయ్య, వెంకటేష్ పాల్గొన్నారు.

నిషేధిత ప్లాస్టిక్ వినియోగంపై ఉక్కు పాదం

తిరుపతి తుడా: నగరంలో నిషేధిత ప్లాస్టిక్ ఉత్పత్తుల విక్రయాలపై ఉక్కు పాదం మోపనున్నట్లు తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ తెలిపారు. తిరుపతి నగరంలో గురువారం ప్లాస్టిక్ విక్రయాలపై కార్పొరేషన్ ప్రజా ఆరోగ్య శాఖ సిబ్బందితో కలిసి హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ దాడులు నిర్వహించారు. 85 కేజీల మేర సింగిల్ యూజ్ ప్లాస్టిక్, క్యారీ బ్యాగులు, సీజ్ చేసి, రూ.72 వేల అపరాధ రుసుము విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నిబంధన మేరకు 120 మైక్రాన్ల కంటే తక్కువ ఉన్న ప్లాస్టిక్ ఉత్పత్తులు విక్రయం, వినియోగించడం చట్ట విరుద్ధమన్నారు. నిషేధిత ప్లాస్టిక్ విక్రయిస్తూ పట్టుబడితే రూ.5 వేలు నుంచి రూ. 25 వేలు వరకు లభ్యతను బట్టి జరిమానా విధిస్తామన్నారు. అలాంటి దుకాణాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. శానిటరీ సూపర్ వైజర్లు చెంచయ్య , సుమతి, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, శానిటరీ మేస్త్రీలు, వార్డ్ హెల్త్ సెక్రటరీలు పాల్గొన్నారు.


ప్లాస్టిక్ స్వాధీనం చేసుకుంటున్న అధికారులు

తిరుమల వీజీవోగా శివ నందకిషోర్

తిరుమల: తిరుమల విజిలెన్స్ ఆఫీసర్‌గా గురువారం ఆర్.శివ నందకిషోర్ బాధ్యతలు స్వీకరించారు. ఈయన తిరుపతి ఏఆర్ డీఎస్పీగా పనిచేస్తూ తిరుమల వీజీవోగా బదిలీ అయ్యారు. ఇప్పటివరకు తిరుమలలో వీజీవోగా పనిచేస్తుండిన బాల్‌రెడ్డి బదిలీపై హెడ్‌క్వార్టర్‌కు వెళ్లనున్నారు.

విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ ఆఫీసర్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న శివ నందకిషోర్



ప్రదీప్‌రెడ్డికి శుభాకాంక్షల వెల్లువ

తిరుపతి రూరల్: చిగురువాడ సర్పంచ్, వైఎస్ఆర్ సీపీ సీనియర్ నాయకుడు ముచ్చెలి ప్రదీప్ రెడ్డి జన్మదినం సందర్భంగా పలువురు నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి, తిరుచానూరు సర్పంచ్ రామచంద్రారెడ్డి, బ్రాహ్మణపట్టు ఎంపీటీసీ యోగనంద రెడ్డి, గణపతినాయుడు, శ్రీరాములు, మునిస్వామియాదవ్, అవిలాల సుధాకర్, వైఎస్ఆర్ సీపీ నాయకులు ప్రదీప్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.


ముచ్చెలి ప్రదీప్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి, నాయకులు

ఘనంగా ఆల్‌సోల్స్ డే



పాకాల: పట్టణంలోని క్రైస్తవుల శ్మశాన వాటికలో ఆల్‌సోల్స్‌డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. గురువారం శ్మశాన వాటికలో సీఎస్ఐ చర్చి పాస్టర్ ప్రేమ్‌కుమార్, ఆర్‌సీఎం చర్చి ఫాదర్ ఆంథోనిరాజ్ సమక్షంలో ఈ ప్రార్థనలు నిర్వహించారు. ప్రతీ సమాధి వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సీఎస్ఐ, ఆర్‌సీఎం క్రైస్తవులు పాల్గొన్నారు.

నేడు జగనన్నకు చెబుదాం కార్యక్రమం

భాకరాపేట: చిన్నగొట్టిగల్లు మండల పరిషత్ కార్యాలయంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమం శుక్రవారం ఉదయం 9.30 గంటలకు ప్రారంభమవుతుందని ఎంపీపీ యుగంధర్‌రెడ్డి తెలిపారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో సమావేశం జరిగింది.

భాకరాపేట ఎస్ఐగా హేమాద్రి

భాకరాపేట: భాకరాపేట ఎస్ఐగా ఎస్.జి. హేమాద్రి గురువారం బాధ్యతలు తీసుకున్నారు. భాకరాపేట ఎస్ఐ ప్రకాష్‌బాబు పదోన్నతిపై సీఐగా బదిలీ కావడంతో ఎస్ఐ పోస్టు మూడు నెలలు ఖాళీగా ఉంది. అన్నమయ్య జిల్లా మదనపల్లె–2 టౌన్ నుంచి హేమాద్రి బదిలీపై వచ్చి బాధ్యతలు చేపట్టారు.

న్యాయమూర్తులకు అదనపు బాధ్యతలు

తిరుపతి లీగల్: ఎర్రచందనం కేసుల విచారణ కోర్టు జడ్జిగా విధులు నిర్వహించిన జడ్జి నాగరాజు పదవీ విరమణ కావడంతో ఆ కోర్టుకు ఇన్‌చార్జ్ న్యాయమూర్తిగా తిరుపతి పదో అదనపు జిల్లా జడ్జి టి.రామచంద్రుడును నియమిస్తూ రాష్ట్ర హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో జడ్జి రామచంద్రుడు రాష్ట్ర ఎర్రచందనం కేసుల విచారణ కోర్టు ఇన్చార్జి న్యాయమూర్తిగా విధులు చేపట్టారు. అలాగే తిరుపతి నాల్గవ అదనపు జిల్లా జడ్జి కోర్టు ఇన్‌చార్జి న్యాయమూర్తిగా స్థానిక ఐదవ అదనపు జిల్లా జడ్జి అన్వర్ బాషా విధులు నిర్వహించాలని హైకోర్టు ఉత్తర్వుల్లో పేర్కొంది.

నామినికి సన్మానం



జీవితానుభవాలను కథలుగా రచించి పాఠకుల మన్ననలు పొందిన సుప్రసిద్ధ రచయిత నామిని సుబ్రమణ్యం నాయుడు వైఎస్ఆర్ లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డు అందుకున్న సందర్భంగా శ్రీకాళహస్తికి విచ్చేసిన సందర్భంలో సబ్ రిజిస్ట్రార్ కొండారెడ్డి, సిబ్బంది ఆయనకు శాలువా కప్పి శ్రీవారి విగ్రహాన్ని బహూకరించి గౌరవించారు.